క్లుప్తంగా

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ఎఫ్ఎస్‌వో జగన్

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలోని నిరుపేదలకు అటవీశాఖ ఆధ్వర్యంలో దుప్పట్లను ఎఫ్ఎస్‌వో జగన్‌మోహన్ శనివారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో సేవాకార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అడవులు, వన్య ప్రాణుల సంరక్షణలో గ్రామస్తులు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో విజయలక్ష్మీ, మాజీ సర్పంచ్ మధునయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి గ్రామంలోని యువకులకు ఎస్సై కొమురయ్య శనివారం వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలని సూచించారు.

దుకాణాల్లో తనిఖీ..

మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఘనంగా హైమన్‌డార్ఫ్ జయంతి



నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

పెంచికల్‌పేట్: ఆదివాసీల ఆత్మబంధువు హైమన్ డార్ఫ్ ఎలిజిబెత్ దంపతుల 38వ వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారితో జీవనం సాగించి సేవలు అందించి ఆదివాసీల ఆత్మబంధువులయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో సిడాం సకారం, బక్కయ్య, రాజారాం, మల్లేశ్, రమేశ్, నరేశ్, వెంకటేశ్, సతీశ్, నీలయ్య, మధునయ్య, గణపతి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో సందడి



దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

ఆసిఫాబాద్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కిరాణా దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్ పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోని దుకాణాల్లో పిండివంటలకు అవసరమైన నువ్వులు, నూనె, బెల్లం, బియ్యం అమ్మకాలు ఊపందుకున్నాయి. మహిళలు నోముల సామగ్రిని కొనుగోలు చేశారు.

14న ముగ్గుల పోటీలు

వాంకిడి: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఈ నెల 14న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గల మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి మొదటి బహుమతి రూ.6 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడవ బహుమతి రూ.1500 లతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆసక్తి గల మహిళలు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి సాకడలో కబడ్డీ పోటీలు

కెరమెరి: మండలంలోని చిన్నసాకడ(శ్యాంరావుగూడ) గ్రామంలో పెందోర్ జంగు పటేల్ స్మారకార్థం ఓం జై శ్రీ బాబా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు పెందోర్ శ్రీనివాస్, సెడ్మకి తుకారాం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.7777, రెండో బహుమతి రూ. 4444, తృతీయ బహుమతి రూ. 2222 అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 96663 22124, 70132 61734లలో సంప్రదించాలన్నారు.

బాల్యంపై తినుబండ'రాళ్లు'

- బేకరీలు, దుకాణాల్లో రంగురంగుల తిండి పదార్థాలు
- ఆకర్షితులవుతున్న చిన్నారులు
- పిల్లల్లో పోషకాహార లోపం



కిరాణా దుకాణంలోని రంగురంగుల తినుబండారాలు

వాంకిడి: బాల్యంలో పోషకాహారం తీసుకోవడం వల్ల భవిష్యత్తులో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యకరమైన జీవనం పొందవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వాలు సైతం అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, పాఠశాలల్లో పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు కృషి చేస్తున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆశలు, వైద్య సిబ్బంది పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలు, పోషకాహారం లోపిస్తే ఏర్పడే దుష్పరిణామాలపై ప్రజలకు తెలియజేస్తున్నారు. అయినా గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లోనూ పిల్లల్లో పోషకాహార లోపం తీవ్రంగా కన్పిస్తుంది. బేకరీలు, కిరాణా దుకాణాల్లో దొరికే రంగురంగుల తిను పదార్థాల వైపు పిల్లలు మక్కువ చూపుతున్నారు. తిండి పదార్థాలను ఆకర్షనీయమైన ప్యాకింగులతో దుకాణాల్లో ప్రదర్శిస్తుండటంతో పిల్లలు వాటిపై ఆసక్తి చూపుతూ పోషకాహారానికి దూరంగా ఉంటున్నారు.

బాల్యంపై ప్రభావం..

అనుమతులు లేని తినుబండారాల్లు బాల్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. పిల్లల్లో ఐరన్ లోపించి రక్తహీనతకు దారి తీస్తుంది. పట్టణ ప్రాంతాల్లో బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, గల్లీల్లోని కిరాణ దుకాణాలు జంక్‌ఫుడ్‌ను అమ్ముతుండగా గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా దుకాణాల్లో విక్రయిస్తున్నారు. అమ్మకానికి ఉంచే ప్రతీ ఆహార పదార్థాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు సర్టిఫైడ్ చేయాల్సి ఉండగా కిరాణాల్లో లభించే తిండి పదార్థాలకు ఎలాంటి అనుమతులు ఉండడం లేదు. రసాయనాలతో కూడిన రంగులను వాడుతూ తయారు చేసిన పదార్థాలు కిరాణాలు, బేకరీల ద్వారా అమ్మకానికి పెడుతున్నారు. అధిక శాతం లాభం లభిస్తుండటంతో దుకాణాల యజమానులు కూడా వాటిని విక్రయించేందుకు ముందుకొస్తున్నారు. పోషకాలతో సంబంధం లేకుండా తిను పదార్థాలు తయారు చేస్తుండగా, ఆకర్షనీయమైన ప్యాకింగ్‌ల వల్ల పిల్లలు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం పౌష్టికాహారం లోపం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. నిత్యం పిల్లలకు దుకాణాల్లోని తిను పదార్థాలు కొనిపెడుతూ వారి భవితవ్యాన్ని ఆదమరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నుంచి పాఠశాల పిల్లల్లో రక్తహీనతను అరికట్టేందుకు 'ఎనీమియా ముక్త్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షల్లో దాదాపుగా 60 శాతం మంది పిల్లల్లో రక్తహీనత లోపం ఉన్నట్లు వైద్యశాఖ సిబ్బంది గుర్తించారు. పోషక విలువలు లేని జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్లే పిల్లల్లో ఐరన్ లోపించి రక్తహీనతకు దారి తీస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు.

రంగురంగుల డబ్బాలు, ప్యాకింగులు..

బేకరీల్లోనే కాకుండా గల్లీలో ఉండే కిరాణ దుకాణాల్లో సైతం రంగులలో కూడిన తిండి పదార్థాలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. చిప్స్, పాపడ్స్, చాక్లెట్‌లు, మైసూర్‌పాక్, బాదూశాలు, గులాబ్ జామ్, రకరకాల చకోడీలు, పదుల రకాల్లో లభించే సమోసాలను అమ్ముతున్నారు. కాగా పిల్లల తల్లిదండ్రులు పోషకాహార లోపంపై అవగాహన కలిగి ఉంటే బాల్యాన్ని భద్రంగా కాపాడే అవకాశం ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

కేజీబీవీలో సంక్రాంతి సంబరాలు



భోగి మంట పెడుతున్న ఎస్‌వో పద్మ



విద్యార్థినులకు భోగిపండ్లు పోస్తున్న అధ్యాపకులు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల కేజీబీవీలో అధ్యాపకులు, విద్యార్థినులు శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం నుంచి పాఠశాలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో అధ్యాపకులు పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఏర్పాటు చే శారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేశారు. రంగు రంగులతో అందమైన ముగ్గులు వేశారు. చిన్నారులకు భోగి పండ్లు వేసి అధ్యాపకులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌వో పద్మ మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలియజేయాలనే లక్ష్యంతో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేశామన్నా రు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగపురే బండు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని వీర్దండి గ్రామంలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించేందుకు సహకరిస్తామన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని తెలిపారు. పోటీల్లో 30 జట్లు పాల్గొంటున్నాయని, మొదటి బహుమతి రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి రూ. 10 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండ ప్రసాద్, రాజు, వెంకటేశ్, రాజ్‌కుమార్, గోవింద్‌రావు, నవీన్, ప్రశాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ



మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌వోటూజీఎం రాజమల్లు

రెబ్బెన: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎస్‌వోటూజీఎం రాజమల్లు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు పదోన్నతులు, హోదా గల ఉద్యోగాలపై శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో పదోన్నతుల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉన్న పలు హోదా గల ఉద్యోగాలు, పదోన్నతుల కాల పరిమితిపై వివరించారు. 16 డిజిగ్నేషన్ల (హోదా ఉద్యోగాల) పై అవగాహన కల్పించారు. మహిళా బదిలీ వర్కర్ల, జనరల్ మజ్దూర్లు ఎంచుకున్న డిజిగ్నేషన్ల ఉద్యోగాలకు అనుగుణంగా తగిన శిక్షణ అందించిన తర్వాత సంబంధిత ఉద్యోగాలకు పంపిస్తామని పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆసక్తితో దరఖాస్తు చేసుకున్న మహిళా ఉద్యోగులకు ప్రస్తుతం ఎంవీటీసీలో పంపు, కన్వేయర్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న మహిళా ఉద్యోగుల గురించి వివరించారు. ఆసక్తి గల ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం



నరేశ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

వాంకిడి: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చీదర్ల నరేశ్‌ను బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ ఆధ్వర్యంలో శనివారం శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. అనంతరం సుచిత్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నాయకులు వనపర్తి సదాశివ్, రామగిరి విశాల్, వికాశ్, వేణు, గణేశ్, ఉమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


కౌటాల అధ్యక్షుడిగా విజయ్



విజయ్‌కుమార్

కౌటాల: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా కుంచాల విజయ్‌కుమార్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ శనివారం తెలిపారు. పార్టీ బలోపేతం కోసం పని చేస్తున్న ప్రతీ కార్యకర్తకు పార్టీ గుర్తింపునిస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ సిఫార్సు మేరకు సదాశివపేట గ్రామానికి చెందిన యువకుడు కుంచాల విజయ్‌కుమార్ మండల అధ్యక్షుడిగా బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకులు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని విజయ్‌కుమార్ తెలిపారు.


'పాల్వాయి' కృషితోనే వంతెనకు అనుమతులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చింతలమానెపల్లి: ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కృషి కారణంగానే దిందా వంతెనకు అనుమతులు వచ్చాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొందరు నాయకులు దిందా గ్రామానికి వెళ్లి అనుమతులు తాము తెచ్చినట్లుగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు దిందా వంతెన అనుమతుల కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, అటవీ శాఖ మంత్రుల ను కలిసి అటవీశాఖకు రూ. 69లక్షలు చెల్లించేలా కృషి చేశారన్నారు. గతంలో సైతం ఈ నాయకులు ప్రజలను మభ్యపెట్టేలా కొబ్బరి కాయలు కొట్టి, శిలా ఫలకాలు ఏర్పాటు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్ములె మల్లయ్య, చౌదరి నానయ్య, సునీల్ మండల్, డోకె రామన్న, చౌదరి నవీన్, కత్తర్ల భీమయ్య, చాప్లె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాలీ సంఘం ఎన్నికలు



మాలీ సంఘం ఓటర్లకు ఎంట్రీ పాసులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కౌటాల: మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ ఎన్నికలను నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 లక్షల వరకు మాలీ సంఘం కులస్తులున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెబ్బెన మండలం నవేగాం గ్రామంలో పోలింగ్ నిర్వహించనున్నారు. దాదాపుగా 600 మందికి పైగా ఈ ఎన్నికలో బ్యాలెట్ రూపంలో ఓటు వేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఎన్నిక ఫలితాలు సంఘం పోలింగ్ నిర్వాహకులు ప్రకటిస్తారు.

ద్విచక్రవాహనాలు ఢీ

బెజ్జూర్: మండలంలోని సలుగుపల్లి చౌరస్తాలో శనివారం ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడిగూడ గ్రామానికి చెందిన సపావత్ రాజు, శోభారాణి దంపతులు వెళ్తున్న ద్విచక్ర వాహనం, ఈసగాం గ్రామానికి చెందిన సనత్‌దాస్, కూతురు సంగీతలు వెళ్తున్న బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నలుగురికి తీవ్ర గాయలు కాగా క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజు, శోభారాణిలను అక్కడి నుంచి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

సర్కారు బడికి వంట పాత్రలు

- కొనుగోలు కోసం రూ.64.50 లక్షలు విడుదల
- జిల్లాలోని 517 స్కూళ్ల ఎంపిక
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపు



వంట చేస్తున్న నిర్వాహకురాలు

ఆసిఫాబాద్‌రూరల్: సర్కారు బడుల్లో ఏళ్ల తరబడి వినియోగిస్తున్న వంటపాత్రల కారణంగా సరైన శుభ్రత ఉండటం లేదు. అనేక పాఠశాలల్లో తరచూ అన్నం, కూరలు అడుగంటుతున్నాయి. పథకం ప్రారంభం నుంచి అల్యూమీనియం పాత్రల్లో వంటలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త వంట పాత్రల కొనుగోలుకు జిల్లాకు రూ.64.50 లక్షల నిధులు విడుదల చేసింది. మధ్యాహ్నం భోజన పథకం (పీఎం పోషణ్) కోసం రాష్ట్ర విద్యా శాఖ నిధులు కేటాయించింది. దీంతో విద్యాశాఖ వంట పాత్రల కొనుగోలు కోసం టెండర్లను సైతం పిలిచింది. జిల్లాలో గుర్తించిన 517 పాఠశాలలకు పాత్రలు సరఫరా చేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారి సీల్డు టెండర్లు కోరుతూ ప్రకటన జారీ చేశారు. ప్రక్రియ పూర్తయితే సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలకు కొత్త వంట పాత్రలు సమకూరనున్నాయి.

517 పాఠశాలలు ఎంపిక..

జిల్లాలో మొత్తం 729 ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలలున్నాయి. వీటిలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా 517 పాఠశాలలను వంట పాత్రలు సరఫరా చేసేందుకు ఎంపిక చేశారు. విద్యార్థుల సంఖ్య 20 లోపు ఉన్న పాఠశాలలను ఇందుకు ఎంపిక చేయలేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. అయితే వీటిలో విద్యార్థుల సంఖ్య 50 వరకు ఉన్న పాఠశాలు 325 ఉన్నాయి. 51 నుంచి 150 వరకు 148 పాఠశాలలు, 151 నుంచి 250 వరకు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలు 24, 251 మించిన విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలు 20తో మొత్తం 517 పాఠశాలలకు గాను రూ.64.50 లక్షలు పాత్రల కొనుగోలు కోసం నిధులు విడుదల చేశారు.

వంట పాత్రలు కేటాయింపు..

వంట పాత్రల కేటాయింపు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేయనున్నారు. 50 మంది విద్యార్థులుండే పాఠశాలకు వంట కోసం 10 కిలోల అన్నం పాత్ర, ఒక్కొక్కటి 5 కిలోల సామర్థ్యమున్న మూడు కూర గిన్నెలు, రెండు స్టీల్ బకెట్లు, నాలుగు చెంచాలు, రెండు బేషన్ తట్టలు, ఒక కట్‌గిర్, మేతలు అందిస్తారు. వీటి కోసం పాఠశాలకు రూ.10 వేలు కేటాయిస్తారు. 51 –150 వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలకు 30 కిలోల అన్నం పాత్ర, 10 కిలోల మూడు కూర పాత్రలు, మిగితా పాత్రల కోసం రూ.15 వేలు కేటాయించారు. 151 –250 వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలలకు 50 కిలోల అన్నం పాత్ర, 15 కిలోలమూడు కూర గిన్నెలు, మిగతా వాటికి రూ.20 వేలు ఇవ్వనున్నారు. 251కి పై విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలకు 50 కిలోల అన్న పాత్రతో పాటు 20 కిలోలవి రెండు, 15 కిలోల ఇక కూర పాత్రలు, ఇతర పాత్రలకు రూ. 25 వేలు కేటాయించారు.

త్వరలోనే అందజేస్తాం..

జిల్లాలో 517 పాఠశాలలకు వంట పాత్రల కోసం టెండర్ల ప్రక్రియ సైతం పూర్తయ్యింది. త్వరలోని అన్ని పాఠశాలలకు కొత్త వంట పాత్రలు పంపిణీ చేస్తాం.

– యాదయ్య, డీఈవో

హ్యాండ్‌బాల్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



క్యాంపు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం జంగు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని క్రీడాపాఠశాల మైదానంలో శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టు కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. పాఠశాల హెచ్‌ఎం జంగు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభచూపి రాష్ట్రస్థాయికి ఎంపికైన వారికి వారం రోజులపాటు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హ్యాండ్‌బాల్ కోచ్ అరవింద్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగుతుందన్నారు.

ఉద్యోగులకు నాణ్యమైన ఆహారం అందించాలి



క్యాంటీన్ పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో నిత్యం నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని కై రిగూడ ఓసీపీ క్యాంటీన్‌ను శనివారం సందర్శించారు. ఉద్యోగులకు అందిస్తున్న అల్పాహారం రుచి చూశారు. ఇటీవల చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. అల్పాహారం నాణ్యత విషయంలో సంతృప్తి వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో అభినందించారు. క్యాంటీన్ వద్ద మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఉద్యోగుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బయ్య మొగిళి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, కైరిగూడ ప్రాజెక్టు అధికారి నరేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సివిల్ ఎస్ఈ మదీనా బాషా, ప్రాజెక్టు ఇంజినీరు వీరన్న, ఇన్‌చార్జి మేనేజర్ అనుగ్రహ నారాయణ్, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయంలో సౌకర్యాలు కల్పించాలి'



మాట్లాడుతున్న ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: జంగుబాయి పుణ్య క్షేత్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. శనివారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ఉత్సవాల నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడ కూడా చెత్తా చెదారం లేకుండా చూడాలన్నారు. తాగునీటి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీపై ఉందన్నారు. ఈ సందర్భంగా కటోదాలతో మాట్లాడారు. ఏదైన అవసరముంటే తక్షణమే సమాచారమివ్వాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంగ్లె రమేశ్ తదితరులు ఉన్నారు.